నేడు టెన్త్ విద్యార్థులకు అవగాహన సదస్సు

బన్సీలాల్‌పేట్: ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థుల కోసం ఈనెల 12న(నేడు) అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు రెయిన్ బో ఫౌండేషన్, సీబీసీ కో–ఆర్డినేటర్ సంధ్యారాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నెహ్రూనగర్ కమ్యూనిటీహాల్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఎడ్యుకేషన్, లైఫ్ స్కిల్స్ ట్రైనర్, ప్రముఖ సైకాలజిస్ట్ ప్రొఫెసర్ పి. జ్యోతిరాజా విద్యార్థులకు ఆయా అంశాలపై తర్ఫీదు ఇస్తారన్నారు. మెమొరీ టెక్నిక్స్, పరీక్షలను ఎలా ఎదుర్కొవాలి అనే అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. బన్సీలాల్‌పేట్, బోయిగూడ, ఆదయ్య స్మారక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు.

హైకోర్టు ప్లీడర్ శ్రీనివాస్‌గౌడ్‌కు సన్మానం



శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన ఎస్ఎల్ శ్రీనివాస్ గౌడ్ ఇటీవల హైకోర్టులో గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. దీంతో నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్ గౌడ్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సి. వి. శ్రీనాథ్ పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కుమ్మరిగూడలో పర్యటిస్తున్న కార్పొరేటర్ దీపిక

రాంగోపాల్‌పేట్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ కొంతం దీపిక పేర్కొన్నారు. మోండా మార్కెట్ డివిజన్‌లోని కుమ్మరిగూడలో ఏఈ చంద్రశేఖర్‌తో కలిసి మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు వేయించాలని ఆమెను కోరారు. స్పందించిన ఆమె వెంటనే ఎక్కడెక్కడ రోడ్లు అవసరం ఉందో అంచనాలు రూపొందించి పంపించాలని జీహెచ్‌ఎంసీ ఏఈకి సూచించారు.

పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావొద్దు



విద్యార్థులకు స్టేషనరీ కిట్స్ అందజేస్తున్న రాజేందర్

అడ్డగుట్ట: విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని బెస్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆరెపల్లి రాజేందర్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో అడ్డగుట్టలోని ప్రభుత్వోన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం స్టేషనరీ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎగ్జామ్ ప్యాడ్స్, బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు, పెన్స్‌తో పాటు ఇతర స్టేషనరీ సామగ్రిని అందించామన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ ఫౌండర్ విజయ్‌కుమార్, సంగీత, రామలీల, ప్రవీణ్ కుమార్, విమల, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని చెన్నకేశవ స్వామి ఆలయ నూతన పాలకమండలి సభ్యులు దేవాదాయ శాఖ అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో మంగళవారం ప్రమాణ స్వీకారం జరిగింది. టి. శ్రీనివాస్, రఘు ముదిరాజ్, అరవింద్, పి. శ్రీనివాస్, స్వాతి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ సమగ్రాభివృద్ధికితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు డి. మల్లికార్జున్, నాయకులు మహేశ్ కుమార్, నాగ, రాఘుయాదవ్, వినయ్, సంతోష్, శ్రీకాంత్ చారి, చందు, శివ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకమండలి సభ్యులు



అధ్వానం ఆరెళ్లే..!

ఆలుగడ్డబావి కూడలిలోని వాటర్ ఫౌంటెయిన్

'కొత్త ఒక వింత..పాత ఒక రోత' అన్నట్లు తయారైంది సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ అధికారుల తీరు. సుందరీకరణ పేరిట ప్రధాన కూడళ్లల్లో పనులు చేస్తున్న అధికారులు ఆ తర్వాత వాటి నిర్వహణను గాలికి వదిలేస్తుండడంతో అవి కాస్తా నిరుపయోగంగా మారుతున్నాయి.
– సికింద్రాబాద్

- నాలుగేళ్ల కిత్రం రూ.90 లక్షలతో పనులు
- నిర్వహణ లేక మూడున్నరేళ్లుగా నిరుపయోగంగానే
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల సుందరీకరణ పనుల్లో భాగంగా ఆలుగడ్డబావి వంతెన కూడలిని 4 ఏళ్ల క్రితం జీహెచ్‌ఎంసీ అధికారులు సుందరీకరించారు. ఇక్కడ రూ.90 లక్షలతో వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేశారు. ఆలుగడ్డబావి రైల్వే ట్రాక్‌ను ఆనుకుని ఉండడంతో ఇక్కడి వాటర్ ఫౌంటెయిన్‌లో ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్ దీపాల మధ్య జలప్రవాహం రాత్రి సమయాల్లో ప్రయాణికులకు ఎంతగానో కనువిందు చేసేది.

నిర్వహణ గాలికి..

సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీకి వస్తున్న ఒక్కో అధికారి నేతృత్వంలో చేపడుతున్న అభివృద్ధి పనుల నిర్వహణ ఆ అధికారి ఉన్నంతవరకే కొనసాగుతున్నాయి. తర్వాత వచ్చే అధికారులు వాటిని పట్టించుకోకపోవడంతో పాటు మరోవైపు మళ్లీ కొత్త ప్రతిపాదనలు చేపడుతుండడంతో కోట్లాది ప్రజాధనం వృథా అవుతోందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఆహ్లాదం ఆరు నెలలే..

వాటర్ ఫౌంటెయిన్‌లోని విద్యుత్‌దీపాల మధ్య జల ప్రవాహాలు 6 నెలల పాటు ప్రయాణికులకు కనువిందు చేశాయి. ఆ తర్వాత విద్యుత్ కాంతులు వెలగకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకే జలప్రవాహాలను పరిమితం చేశారు. తర్వాత మోటార్ల సమస్య కారణం చూపి మొత్తంగా వాటర్‌నే నిలిపివేశారు. మరోవైపు దానికి మరమ్మతులు చేపట్టకపోవడంతో మూడున్నరేళ్లుగా నిరుపయోగంగా ఉంటున్నది. నిత్యం ఇదే రహదారి గుండా ఎందరో జీహెచ్‌ఎంసీ అధికారులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ఏ ఒక్క అధికారి వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.



నిర్వహణ లేక నిరుపయోగంగా మారిన ఫౌంటెయిన్

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



వేడుకల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆర్‌పీలు, ఆశ కార్యకర్తలు, నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే శ్రీగణేశ్

రసూల్‌పురా: కంటోన్మెంట్‌లోని లీప్యాలెస్‌లో ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు మ్యూజికల్ చైర్, లెమన్‌స్పూన్‌తో ఇతర ఆటల పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే మహిళలతో కలిసి జానపద, సినీ గేయాలకు నృత్యాలు చేశారు. అలాగే పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు, ఆర్‌పీలు, ఆశ కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను సన్మానించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, అధికారంలోకి వచ్చిన మొదటి రోజే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వెస్ట్ మారేడుపల్లి వైడబ్ల్యూసీఏ ఆవరణలో..

కంటోన్మెంట్: 'ఇన్‌వెస్ట్ ఇన్ ఉమెన్–అక్సిలరేట్ యాక్షన్' పేరిట వెస్ట్‌మారేడుపల్లిలోని వైడబ్ల్యూసీఏ ఆవరణలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైడబ్ల్యూసీఏ సికింద్రాబాద్ ప్రధాన కార్యదర్శి షారోన్ సాలమన్ మాట్లాడుతూ.. కుటుంబం, సమాజాభివృద్ధిలో మహిళలు వెన్నెముకగా నిలుస్తున్నారన్నారు. అయితే ఇప్పటికీ విద్య, ఉపాధి, హెల్త్‌కేర్, లీడర్‌షిప్ వంటి రంగాల్లో మహిళలు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారని వారికి ఆయా రంగాల్లో మరింత తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్కిట్‌లు, గేమ్స్‌లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైడబ్ల్యూసీఏ ప్రతినిధులు నింపియా రెడ్డి, రాధికారావు, పర్వేజ్ భోటే, ఆరతి పత్రేకార్, పౌలా జేమ్స్, లోనా డిమ్మీ పాల్గొన్నారు.



వైడబ్ల్యూసీఏ ఆవరణలో..

తాగునీటి సమస్యతో ఇబ్బందులు

కాచిగూడ: మంచినీటి సమస్యతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సమస్యను గుర్తించి సత్వరమే పరిష్కరించి నీటి సమస్య లేకుండా చూడాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ జలమండలి అధికారులకు సూచించారు. మంగళవారం జలమండలి డీజీఎం కృష్ణ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌లతో కలిసి డివిజన్ పరిధిలోని మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్న చెప్పల్‌బజార్, మణియార్ పట్టి, మోతీమార్కెట్, సునార్‌లేన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులు కొంత కాలంగా లోప్రెషర్‌తో నీటి సరఫరా కావడంతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణణాతీంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పాటిల్, అశీష్, బి.భీమ్‌రాజ్, రూప్‌కిరణ్, ఆర్.సంతోష్, సూరి, రవియాదవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం



కిశోర్



సంధ్య

చిలకలగూడ: కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి జోషికంపౌండ్‌కు చెందిన కిశోర్, సౌజన్య భార్యభర్తలు. ఈనెల 8న రాత్రి 7.30 గంటలకు కిశోర్ (42) బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో సన్నిహితులు, బంధుమిత్రులను వాకబుచేసిన ఫలితం లేకుండాపోయింది. దీంతో భార్య సౌజన్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తుకారాంగేట్ పీఎస్ పరిధిలో మహిళ..

అడ్డగుట్ట: మహిళ అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్టకు చెందిన సంధ్య (32) సఫీల్‌గూడలోని ఓ ఇంట్లో వంట మనిషిగా పని చేస్తోంది. ఈనెల 1న ఉదయం పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. రాత్రి భర్త ఇంటికొచ్చేసరికి సంధ్య కనిపించకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తెలిసినవారిని, బంధువులను వాకబు చేసినా ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం స్థానిక తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స కోసం వచ్చిన వ్యక్తి ..



సుదర్శన్‌గౌడ్

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి నుంచి వ్యక్తి అదృశ్యమయ్యాడు. గాంధీ అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ శరత్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా చంపాపేట్ మారుతీనగర్‌కు చెందిన సుదర్శన్‌గౌడ్ (47) కొంతకాలంగా మానసిక రుగ్మతలు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈనెల 6న సోదరుడితో కలిసి చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి రాగా అడ్మిట్ చేయాలని వైద్యులు సూచించారు. గాంధీ అత్యవసర విభాగం వద్ద ఉంచి సోదరుడు అడ్మిషన్ కోసం వెళ్లి వచ్చేసరికి సుదర్శన్‌గౌడ్ కనిపించలేదు. దీంతో దవాఖాన పరిసర ప్రాంతాలతో పాటు చంపాపేటలో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో సోదరుడు సంతోష్‌కుమార్‌గౌడ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక ఆరోగ్యంతోనే సానుకూల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ: మానసిక ఆరోగ్యంతోనే సానుకూల మార్పు సాకారమవుతుందని డాక్టర్.సురేశ్ కుమార్ మురుగేషన్ అన్నారు. ఓయూ క్యాంపస్‌లోని ఆంధ్రామహిళా సభ బీఈడీ కాలేజీ ఆడిటోరియంలో దక్కన్ పాజిటివ్ మెంటల్ హెల్త్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ (డీపీఎంపీ) ఆధ్వర్యంలో 'మైండ్ స్కేప్స్, సైకాలజీ ఫర్ ది నెక్ట్స్ జనరేషన్' అనే అంశంపై డీపీఎంపీ వ్యవస్థాపక అధ్యక్షురాలు సునంద రవి అధ్యక్షతన మొదటి జాతీయ సదస్సు మంగళవారం జరిగింది. డా.సురేశ్ కుమార్ మురుగేషన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక ఆరోగ్యంపై భవిష్యత్తు తరాలు శాస్త్రీయంగా అధ్యాయనం చేయలన్నారు. అనంతరం సదస్సులో పాల్గొన్న ప్రతినిధులకు సర్టిఫికెట్లను అందజేశారు. జ్యోతి రాజా, డా.బీకే పాండియ మణి, డా.నెహాగాలా, డా. శ్రీప్రియషాజీ, సుబ్రమణ్యం, అనంత నారాయణన్, పి.దినాకర రావు, కీర్తి, సుధామణి, గిరిమెళ్ల కల్యాణి, మధురిమ మోపిదేవి, డా.అర్చన వేదాంతం, జి.రాజ్యలక్ష్మి, శారద, శృంగేరి పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



సనత్‌నగర్: హనుమాన్ ఆలయం (సెవన్ టెంపుల్స్) శ్రీమదలర్మేల్‌మంగా, పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉదయం పలు పూజా కార్యక్రమాలు అలాగే కొట్నాలు, అప్పగింతలు, వసంతోత్సవంతో పాటు చక్రస్నానం ఘట్టాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణిలో చక్రస్నాన ఘట్టాన్ని పూర్తి చేశారు. సాయంత్రం పలు పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ సత్యనారాయణనాయుడు పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భక్తులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



అంబేద్కర్‌నగర్ బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

కంటోన్మెంట్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు సమీపంలోని అంబేద్కర్‌నగర బస్తీలో మంగళవారం పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కంటోన్మెంట్, జీహెచ్‌ఎంసీ సరిహద్దులో ఉన్న ఈ బస్తీ దేనిపరిధిలోకి వస్తుందోనని గతంలో సందిగ్ధత ఉండేదని, ప్రస్తుతం పూర్తిస్థాయిలో కంటోన్మెంట్ ఆధ్వర్యంలోనే పనులు జరుగుతున్నాయని బస్తీవాసులు తెలిపారు. ఇదిలాఉంటే తమ బస్తీ అల్వాల్, తిరుమలగిరి, బొల్లారం పోలీసుస్టేషన్ల సరిహద్దుల్లో ఉందని ఏ స్టేషన్ పరిధిలోకి వస్తుందో అర్థం కానీ పరిస్థితి నెలకొందన్నారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. త్వరలోనే ఇళ్ల పట్టాలు అందిస్తామని, డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేడుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బస్తీ నాయకులు సైదులు, అజయ్ కుమార్, బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాంగోపాల్‌పేట్: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ చీర సుచిత్ర సూచించారు. వార్డు డెవలప్‌మెంట్ కార్యాలయంలో పథకం నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్ బీజేపీ నాయకులతో కలిసి పథకంపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ పథకం 2028 వరకు అమల్లో ఉంటుందన్నారు. ఆయా కుల వృత్తుల వారు తమ నైపుణ్యాలను మెరుగు పర్చుకునేందుకు 15 రోజుల పాటు శిక్షణ ఉంటుందని అదే సమయంలో రోజుకు రూ.500 స్టైఫండ్‌గా చెల్లిస్తారని పేర్కొన్నారు. అనంతరం వారి వృత్తిని అభివృద్ధి చేసుకునేందుకు రుణాలు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశ్విని, నితీశ్ బోలే, ఆనంద్ వ్యాస్, సాగర్, స్వప్న, కోమల్ శర్మ, కిరణ్ షా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పేర్లు నమోదు చేయిస్తున్న కార్పొరేటర్ సుచిత్ర

ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష



దీక్షలో ఎంఎస్‌ఎఫ్ విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం లేకుండా ఉద్యోగ ఫలితాలు విడుదల చేయాడాన్ని నిరసిస్తూ ఓయూలో ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా దీక్షలు చేపట్టామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన మాట ప్రకారం గ్రూప్–1, 2, 3 ఉద్యోగాలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఇతర ఉద్యోగాల ఫలితాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాల భర్తీతో మాదిగలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ నాయకులు సోమశేఖర్‌మాదిగ, కొమ్ముశేఖర్‌మాదిగ, డాక్టర్ పల్లెర్ల సుధాకర్ మాదిగ, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు.

హుండీ ఆదాయం రూ.3,11,574

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయం నాలుగున్నర నెలల హుండీ డబ్బులు మంగళవారం లెక్కించగా రూ.3,11,574 ఆదాయం వచ్చింది. ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ ఎం.నర్సింగ్‌రావు, ఈవో పి.లక్ష్మారెడ్డి, ఇన్‌స్పెక్టర్ పి.అందల్, కమిటీ సభ్యులు గుర్రం దినేష్, డి.బానుచందర్, బంజారు నవీన్, అర్చకులు ఇ.కాశీనాథశర్మ, భవనందశర్మ, వేణుగోపాలచారి పాల్గొన్నారు.

ఆలయంలో చోరీకి యత్నం

చిలకలగూడ: ఆలయంలో చోరీకి యత్నించిన దుండగుడిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మారావునగర్ సాయిబాబా ఆలయం పక్కనగల రేణుకా ఎల్లమ్మ ఆలయంలోకి మంగళవారం మధ్యాహ్నం ఓ వర్గానికి చెందిన అగంతకుడు ప్రవేశించాడు. అమ్మవారి విలువైన నగలు, వస్తువులు మూటకట్టి ఎత్తుకెళ్లేందుకు యత్నించగా, ఓ బాలుడు చూసి దొంగ అంటు గట్టిగా కేకలు వేశాడు. వస్తువుల మూటను అక్కడే వదిలేసి ఆలయ గంటను పట్టుకుని పరుగులు తీశాడు. స్థానికులు గమనించి పట్టుకుని దేహశుద్ధి చేసి చిలకలగూడ పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన కావేటి శంకర్ (58) ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కంటోన్మెంట్ బోర్డు ప్రత్యేక సమావేశం

- సీఎస్‌ఎంగా భానుక నర్మద ప్రమాణ స్వీకారం
- పలు అంశాలపై చర్చించే అవకాశం



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ప్రత్యేక సమావేశం బుధవారం జరగనున్నది. కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలిగా భానుక నర్మదను నియమిస్తూ కేంద్రం ఇటీవలే గెజిట్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఉదయం 11 గంటలకు బోర్డు కార్యాలయంలో జరిగే సమావేశంలో ఆమె ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్టేషన్ కమాండర్, బ్రిగేడియర్ నంజుండేశ్వర బోర్డు ఆధ్వర్యంలో జరిగే మీటింగ్‌లో కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌తో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొంటారు.

11 ఏళ్ల తర్వాత..

భానుక నర్మద మల్లికార్జున్ 2008 జూన్‌లో తొలిసారిగా కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలిగా ఎన్నికయ్యారు. అలాగే 2011 మేలో దేశంలోనే తొలి మహిళా బోర్డు ఉపాధ్యక్షురాలిగా ఎన్నిక చరిత్ర సృష్టించారు. 2014 జూన్‌లో పదవీకాలం పూర్తి కావడంతో మాజీ బోర్డు సభ్యురాలిగా మారిపోయారు. తిరిగి 2015లో జరిగిన బోర్డు ఎన్నికల్లో భానుక నర్మద స్థానంలో ఆమె భర్త మల్లికార్జున్ బోర్డు సభ్యుడిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2021లో భానుక నర్మద, మల్లికార్జున్ దంపతులు బీజేపీలో చేరగా మల్లికార్జున్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అయ్యారు. 2021లో సాధారణ బోర్డు పదవీకాలం పూర్తికాగా, ముగ్గురు సభ్యులతో కూడిన వేరీడ్ బోర్డు మనుగడలోకి వచ్చింది. అయితే కేంద్ర ప్రభుత్వం బీజేపీ నేత, మాజీ బోర్డు సభ్యుడు జే. రామకృష్ణకు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడిగా అవకాశం కల్పించింది. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆశీస్సులతో రామకృష్ణకు కేంద్రం పదే పదే అవకాశం కల్పిస్తూ వచ్చింది. తాజాగా మల్కాజ్‌గిరి ఎంపీగా ఈటల రాజేందర్ విజయం సాధించడంతో కంటోన్మెంట్ బీజేపీ రాజకీయాల్లో మార్పులు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే ఎంపీ ఈటల తన వర్గానికి చెందిన భానుక నర్మద మల్లికార్జున్‌కు అవకాశం కల్పించాలంటూ కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. అయినప్పటికీ గత జనవరి 3న కేంద్రం మరోసారి రామకృష్ణకే అవకాశం కల్పిస్తూ గెజిట్ జారీ చేసింది. దీన్ని సీరియస్‌గా పరిగణించిన ఈటల, తన పార్లమెంటరీ స్థానం పరిధిలోని నామినేటెడ్ పోస్టును తాను సూచించిన వ్యక్తికే ఇవ్వాలంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి విన్నవించారు. దీంతో భానుక నర్మదను బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలిగా నియమిస్తూ గత గురువారం కేంద్రం మరో గెజిట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో దాదాపు 11 ఏళ్ల తర్వాత భానుక నర్మద మరోసారి బోర్డులో అడుగుపెట్టబోతున్నారు.



భానుక నర్మద, బోర్డు సభ్యురాలు

చర్చించే అంశాలివే..

- గత డిసెంబర్ నుంచి వివిధ దశల్లో బోర్డుకు వచ్చిన భవన నిర్మాణ దరఖాస్తులకు సర్క్యులర్ ఎజెండా ద్వారా అనుమతులు జారీ చేశారు. ఈ మేరకు ఆయా సర్క్యులర్ ఎజెండాలపై చర్చించి బోర్డు ఆమోదం తెలుపనున్నది.
- దాదాపు 15 ఏళ్ల క్రితం కంటోన్మెంట్‌లో జైకా నిధులతో వేసిన డ్రైనేజీ లైన్లకు సంబంధించిన లాటరల్స్, సబ్ మెయిన్స్‌ను కలిపే ప్రక్రియకు సంబంధించిన టెండర్లకు ఆమోదం తెలిపే అవకాశముంది.
- సిటీ సివిల్ కోర్టుల ప్రాంగణంలో నిర్మించనున్న అడ్వొకేట్స్ క్యాంటీన్ నూతన భవన నిర్మాణానికి అనుమతులివ్వనున్నారు.